9. కాందిశీకులు

ఉత్తరం ఇంకోసారి చదివాను. "కాందిశీకుణ్ణియి రేపు సాయంత్రం నీ దగ్గరకు వస్తున్నా, కాస్త స్టేషన్‌కు రావాలి–"

అదే నాకు అర్థమవటంలేదు. బాంబులకు భయపడి పరుగెత్తే వాళ్ళందరూ కాందిశీకులుగా దినపత్రికల్లో పేర్కొన బడుతున్నారు. మరి యీ కృష్ణమూర్తి కాందిశీకుడెలా అయాడు? ఏ విధంగా చూచినా గుంటూరు యుద్ధభయమున్న ప్రదేశంకాదాయె. అందులోనూ ఇండియా తూర్పు తీర పట్టణాల్లో అల్లకల్లోలమంతా యీ నెలరోజుల్లోనూ పూర్తిగా అణిగిపోయింది. ఈ పరిస్థితుల్లో అతను 'కాందిశీకుడి'గా వస్తున్నానని రాయటంలోని అంతరార్థమేమిటి?

ఆ పగలంతా ఆలోచించాను.... ఆ మాటకు నాకు నవ్వు వచ్చిందేకాని, అసలు కీలకం ఎక్కడుందో తెలియలేదు. పోనీ కవిత్వధోరణిని నాకు కాస్త రుచిచూపటానికి ప్రయత్నించాడనుకున్నా– నా బుల్లి బుర్రకు యెక్కని కవిత్వాన్ని నేనెలా అర్థం చేసుకోగలననుకున్నాడు? ఆ 'కాందిశీకుడు' అనే మాట– ఎన్ని నిఘంటువులు తిరగేసినా, నాకున్న కొద్ది భాషాజ్ఞానాన్ని ఎన్నిదిక్కుల తరచిచూచినా– కనీసం అతని ఉద్దేశపు ఛాయకూడా గ్రహించలేకపొయ్యాను. ఇక లాభంలేదని రెండోమార్గంలేక అతని రాకకోసమే ఎదురుచూడసాగాను–

సాయంత్రం బండిలో నాకు అంతుపట్టని 'కాందిశీకుడు' దిగనే దిగాడు. తనతోపాటే యిద్దరు లైసెన్సు కూలీలకు సరిపడే సామానుకూడా దింపాడు. ఈ బుల్లి సంసారాన్ని చూసేటప్పటికే– కృష్ణమూర్తి నిజమైన కాందిశీకుడుగా తోచాడు. అతను యీ వూరు యే వ్యవహారాల మీద వచ్చాడో తెలుసుకునేందుకు యీ సామానేమీ

సహాయపడలేదు. ఇంతవరకూ వింటూ వచ్చిన 'కాందిశీకుడు' నిజంగానే దర్శనం యిచ్చేటప్పటికి- నా అనుమానాలు ఒకటికి పది అయినయ్.

మామూలు కుశలప్రశ్నలన్నీ అయ్యాక, యీ బండెడు సామానుతోనూ యిల్లు జేరాం.

"ఇల్లంతా ఖాళీగా వుందే!" అన్నాడు అతను.

"... కాన్పుకు వెళ్ళింది-"

"మంచిదే!" అన్నాడు, నవ్వుతూ.

హోటల్‌మెతుకులు నంజి, వెన్నెట్లో సిగరెట్లు ముట్టించి లోకాభిరామాయణం పారాయణలో పడ్డాం.

"ఇంతకూ నువ్వు కాందిశీకుడివి ఎలాగయ్యావ్?" అన్నా, ఆ మాటకువొచ్చే వ్యాఖ్యానాన్నంతట్నీ తీరిగ్గా జీర్ణించుకునే సమయం ఇదేనని తోచి.

అతను నవ్వి, "అక్కథావిధానం బెద్దియన..." అని ఆగాడు.

వినాలనే కుతూహలంకొద్దీ, "చెప్పు-" అని హెచ్చరించా.

"ఈమధ్య మెడ్రాస్ నుంచి కాందిశీకులు రైళ్లుపట్టకుండా వచ్చారు- జ్ఞాపకం ఉందా?"

"మెడ్రాస్ నుంచి వచ్చారుకాని, గుంటూరు నుంచి కాందిశీకులేమిటి?" అన్నా, నాకు సరిగ్గా ఎంతవరకూ అర్థమైందో చెప్పుకుంటున్నట్టు.

".. అదే. ఆ మెడ్రాస్ ముఠాలోనే వచ్చిపడ్డాడు!"

"ఎవరూ?"

"రాఘవరావ్!"

"ఏం రాఘవరావ్?"

"నీకు తెలియదు కాబోలు- నేటి సాహిత్యశాఖలో ఇరుక్కున్న వ్యక్తుల పేర్లు కాస్త విన్నా ఉండవాయె!... సరే- చెప్తాను విను, వాడొక కవి. కవిత్వం ఇక్కడ పొట్టనింపే వస్తువు కాకపోవటం వల్ల, మెడ్రాస్ జేరి- నానా అవస్థలూపడి ఒక పత్రికాఫీసులో ఎలాగో ఉద్యోగం సంపాయించాడు-"

"ఎడిటరా?"

"అదే- ప్రూఫురీడరు-"

"ఊహు... తరువాత?"

"ఏముందీ? విశాఖపట్నం, కాకినాడల్లోపడ్డ బాంబులు ఉత్తరదిశ నుంచీ, కొలంబోలోపడ్డ బాంబులు దక్షిణ దిశ నుంచీ కవిని అదరగొట్టినాయ్. ఈ ప్రాణగండం

తప్పించుకునేందుకు, కవి మీద దయదల్చి ఆఫీసు వాళ్లు శెలవ ఇచ్చే స్థితిలో లేరు. ఒక్కొక్కరే రాజీనామాలిచ్చో, చెప్పకుండా చల్లగా జారుకోవటమో చూశాక కవికి మహాపట్టణం మీద ఇన్నాళ్లూవున్న ప్రేమకాస్తా పోయింది. ప్రాణంమీది తీపి అధికమై, అర్ధరాత్రి ఎవరి చెవినా వెయ్యకుండానే, ఆ చీకట్లో కాందిశీకుల గుంపులోచేరి-గుంటూరు జేరుకున్నాడు-"

ఈ సోదంతా అతను ఎందుకుచెప్తున్నాడో, ఎక్కడో మొదలైన సంభాషణ ఎక్కడకో పోతోందని గమనిస్తున్నాడో లేదోననే అనుమానం అధికమై, హెచ్చరికగా, "ఇంతకూ అసలు సంగతేమిటి?" అన్నా.

"వచ్చి నా గదిలో బిఛాణా పరిచాడు... మొదట్లో చాలాకులాసాగా వుంది. వాడితో కలిసి తిరగటమంటేనే సరదాగావుండేది. వాడి ఖర్చులన్నీ భరించటంలోని భారాన్నీ మొదట్లో నేనేమీ 'ఫీ' లవలేదు...

"ఇది చూసి ఇంతకుపూర్వంకాల్చే డక్కన్ సిగరెట్లను విసర్జించి సిజర్స్‌లోకి దిగాడు. హోటల్లో స్పెషల్ కర్డ్‌లేందే ముద్దదిగదాయె! చీకటి పడగానే ఏ సినిమాయో చూడకపోతే నిద్దరపట్టదని పేచీవేసేవాడు. ఏదో మెడ్రాస్ జీవితానికి అలవాటుపడ్డాడు కదానని వాడి కోర్కెల్ని సాగనిచ్చాను.. కాని క్రమక్రమంగా వాడు మితిమీరి ఏకుమేకయ్యాడు. తనకున్న కోర్కెల్లో దాపరికాన్ని పూర్తిగా వదిలాడు. ఖర్చు భరించటం దుర్భరమైంది. నాకువచ్చే నాలుగొందల రూపాయిల గ్రాసంలోనూ ఏడాదంతా గడవాలాయె! పెళ్లాం బిడ్డలు లేకపోయినా పట్టణంలో ఆమాత్రం ఖర్చుకాకుండా వుంటుందా? వీడికోసమని నా సౌఖ్యాల్ని ఎక్కడ బలిఇచ్చేది?"

"ఇంతకూ ఏమైందీ?"

"అయేందుకు యేముందీ? ఉద్యోగం లేనన్నాళ్లూ వాడికి యీ ప్రపంచంలోవున్న బంధువుల ఇళ్లూ, స్నేహితుల ఇళ్లూ బీరుపోకుండా తిరిగేశాడు. ఇక నాలుగు రోజులపాటు మెడ్రాసులో స్నేహాన్ని నటించిన పాపంవల్ల నేనొక్కణ్ణే వీడికి దొరికాను. మొదట్లో గౌరవం చేత, తరువాత మొహమాటంవల్లా - రెండు వారాల వరకూ ఓర్చుకున్నాను. వీడేమో వదిలేట్టు కన్పించలేదు. పోనీ వెళ్లిపొమ్మందామా అంటే-మొహాన్న కొట్టినట్లు ఎట్లా చెప్పటం? వాడు నిర్భయంగా విడిచిన చొక్కాను ఎక్కడపడితే అక్కడే పడెయ్యటం చూస్తే-వాడిజేబులో సెకండ్ హాండ్ పర్స్ విలువతప్ప ఇంకేమీ లేదని తేలిపోయింది... 'మళ్లీ ఉద్యోగంకోసం ఎక్కడన్నా ప్రయత్నించరాదా?' అన్నాను లౌకికంగా ఒకనాడు. 'మనకు ఎవరిస్తారు? వెధవ ఉద్యోగం- పోనిద్దూ' అన్నాడు. వాడి వాలకం జూస్తే స్నేహితుడే దొరకాలి కాని వాడి అంతు కనుక్కునే ఉద్యోగమే భూలోకంలో ఎన్నుకోదగ్గదిగా- ఎన్నడో తేల్చుకున్నట్టు కనిపించింది. రెండుమూడు రోజులు దీర్ఘాలోచన చేసి, వీడు మనను వదలడు కనుక, మనమే వీణ్ణి వదలించుకోవటం

మంచిదని నిశ్చయించుకున్నా. ఏవో అర్జంటు పనుల వంకపెట్టి మరి నెలదాకా రావటం పడదని వాడికి నచ్చజెప్పి, మెల్లిగా ఇటు జేరుకునేప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. పదిహేను ఇరవై రోజులవరకూ వాడు నా కోసం గుంటూరులోనే కాచుకుని వుంటాడనే నా నమ్మకం. ఆ కాందిశీకుడే నన్నొక కాందిశీకుడుగా తయారుచేశాడు- తెలిసిందా?"

నాకు 'కాందిశీకుడు' అనేమాటకు పూర్తిగా అర్థం తెలిశాక, కృష్ణమూర్తితోపాటే నవ్వక తప్పిందికాదు.

2

మొదటి నాలుగైదురోజులూ చాలా కులాసాగా గడిచినాయ్... ఒక రాత్రి నిద్రపోగానే ఆలోచనలో పడ్డాను.

నెలకు వచ్చే ముప్ఫై రూపాయిల్లోనూ - మా ఆవిడ మందులకూ, మాకులకూపోను – మిగతా పైకం ఒళ్లుదగ్గర పెట్టుకుని వాడుకోకపోతే ఇదివరకేవున్న అప్పులు మరికాస్త పెరగటం తప్పదు. ఈ ఉద్యోగం ఒక్కటే నమ్ముకు కూర్చోవటంవల్ల మరీ జాగర్తతీసుకోవటం అవసరమైంది. ఇలాటి జీవితంలో ఇంకో స్నేహితుణ్ణి ఎన్నాళ్లని పోషించగలను? పైగా కృష్ణమూర్తి ఉన్నవాడేనాయె! తన పర్స్‌లోంచి కాణీకూడా ఖర్చు పెట్టడు, అతన్ని ఖర్చు పెట్ట నీకపోవటం నాలాటి వాడు తప్పనిసరిగా పాటించాల్సిన అతిథిగౌరవమైంది. మరీ అసలు వున్నదానికన్న నాలుగైదు రెట్లుగా అతని ఎదుట నటించటాన్ని-ఉన్నట్టుండి, ఇప్పుడు తీసెయ్యటం-నన్ను నేను బైటపె ట్టుకోవటమే అవుతుంది. ఇలాటి గౌరవాన్నే మరికొద్ది రోజులు నేను పాటిస్తే-నా గతేంకాను?

ఇతని మాటల ధోరణిని పట్టిచూస్తే-ఆ కవిగాడికోసం మరోరెండు వారాలన్నా ఇక్కడ బిఛాణా పరిచేట్టున్నాడు. ఏదైనా ఇతర పనిమీద వచ్చినవాడైతే - పనవగానే వెళ్తాడనే నమ్మకం వుంది. కాని యేపనీ లేకుండా వచ్చినవాడు ఎన్నాళ్లన్నా ఉండొచ్చు! మరీ అతని సాహిత్య శాఖలో యీ నాలుగైదు రోజుల్లోనూ దొరికిన ఇతర స్నేహితులు అతన్ని ఇప్పట్లో వదిలేట్టు కూడా లేరు!

ఐనా అతను నాకేమంత పెద్దస్నేహితుడు? ఎప్పుడో ఇంకో స్నేహితుడి ద్వారా పరిచయమై ఇరవై సాయింత్రాల పాటు కలసి తిరిగిన స్నేహమేనాయె! కాల పరిమితినిపట్టి స్నేహితం బలాబలాలు లేకపోయినా-మా యీ స్నేహం యేమంత చెప్పుకోదగ్గదిమాత్రం కాదు. మొదట్లో యీ స్నేహితాన్ని వృద్ధిచేసుకోవాలని వున్నా-పూర్వస్నేహం యీ అతిథి రూపాన మెడకు చుట్టుకున్నాక- ఆ కాస్త అభిలాషా జారుకుంది.

ఐన బంధువుడు వరసాగ్గా వారం రోజులు తిష్టవేస్తేనే ఎంతో కష్టంగావుంటుంది. ఇక యీ బాదరాయణ సంబంధీకుడు-జబర్దస్తీగా బస్తీ ఖర్చులన్నీ నాకు రుద్దుతూంటే ఎలా వుంటుందీ! ఎంతదూరపు బంధువుడైనా - వీధిలోకి ముష్టికి వచ్చిన వాడికి చెప్పినట్లుగా 'దయచెయ్యి' అని ఎలా చెప్పగలం! సాంఘికంగా సమానమైన వ్యక్తితో అసలు మామూలు మాటల్లోనే అతిజాగర్త తీసుకోక తప్పదు. ఆ అనసూయాదేవి అతిథుల్తోపడ్డ అవస్తంతా జ్ఞాపకం వచ్చింది.

మొదట్లో అతని ముఖంలో మెరిసే చిరునవ్వుకు నా ఒళ్లు ఉప్పొంగేది. కాని ఇప్పుడు అతని ముఖంచూస్తే-నా దృష్టి పడకుండా చేసుకునే ఉపాయం లేదా అనిపించేది. ఈ పాడు స్నేహితం ఎక్కువైనకొద్దీ..... అతని మాటలు విని ఆనందించే రోజులుకూడా గడిచిపోయినై. ఏదో చెవులున్నయ్ కనుక వింటున్నానే కాని ఆ మాటల్ని అర్థం చేసుకునేందుకు కూడా శ్రమ తీసుకోవటంలేదు.

ఆ కవి కడుపు చల్లగా-ఇతని భుజాన ఎక్కితే, అదొచ్చి 'ఎలక్ట్రిక్ షాక్' లాగా నా మీదపడ్డది. ఇక యీ కాందిశీకుణ్ని ఎలాగైనా వదిలించుకోవాలి....... దీనికి ఎక్కువ శ్రమపడనక్కర్లేదు. ఎందుకంటే, ఒక అతిథి బెడద వదిలించుకునేందుకు ఇతను యే పనిచేశాడో, అది వచ్చిన నాడే నాకు పాఠంలాగా నూరిపోశాడు. ఇక ఆ సూక్ష్మమార్గమే నాకు కర్తవ్యం - అంటే రహదారి !

కాని, ఇతనికన్న తెలివితేటల్తో తప్పించుకోవాలి. ఒకసారి మోసపోయిన వాడికి, అంతకన్న బలమైన మోసమైతేనేకాని పారదు. సరైన నమ్మదగ్గ కారణాల్ని నేను చూపకపోతే, అతను పైకి నమ్మినట్టు నటించినా, లోపల అసలు సంగతి గ్రహించకపోడు. ఊరు వదిలి వెళ్లాలంటే, నాకు ఇంకో చావుకూడా వుంది. కృష్ణమూర్తిలాగా నిరుద్యోగినైతే ఫర్వాలేదు, కాని ఆఫీసులో శెలవు దొరకేమార్గంకూడా వెతుక్కోవాల్సిన బాధ్యత ఒకటి నాకు వుంది.

మరో రెండు రోజుల ఆలోచనతో రెండుపనులూ కలిసివచ్చే పన్నాగం పన్నాను. ఒక టెలిగ్రాంను సృష్టించి, అందులో మా అత్తగార్ని టైఫాయిడ్ రోగిగా రంగువేశాను. దాని మహత్యం వల్ల ఆఫీసులో అరనెల శెలవు దొరికింది.

కాస్త విచారకరమైన మొహంవేసి, కృష్ణమూర్తికి టెలిగ్రాం చూపాను.

"ఐతే ఎప్పుడు వెళ్తావ్?" అన్నాడు అతను.

"సాయింత్రం బండికి -"

"నేనూ వెళ్తాను-"

"ఇంకోవారం ఉండు, బహుశా అప్పటికి వచ్చేస్తాను-" అన్నాను, మర్యాదకోసం. అన్నాక 'సరే' నంటాడేమోనని నా గుండెల్లో రాయిపడ్డది.

"కాదులే..... టైఫాయిడ్‌గా ! బాగా తగ్గేదాకా వుండకపోతే యేం బాగుంటుందీ?"

"మరి నువ్విప్పుడు ఎక్కడికి వెళ్తావ్?"

"ఇంకో స్నేహితుడి దగ్గరికి."

చివరకు తప్పనిసరిగా ఒప్పుకున్నట్టు తలూపాను.

నాకూ ఇంకోస్నేహితుణ్ని వెతుక్కోవాల్సిన అవసరం ఉండనేవుంది, ఆ నిర్భాగ్యుణ్ని కూడా త్వరలోనే తేల్చుకున్నాను !

సాయింత్రం రైలెక్కాను. బండి బయలుదేరింది కాని, నేనొక కాందిశీకుణ్ణయాననీ, నా నిర్భాగ్య స్నేహితుడు కూడా మరో కాందిశీకుడుగా నా మూలాన తయారౌతాడనీ ఆలోచించనేలేదు.

– *ఆగష్టు, 1943*